

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589 (309.0570)	3,48,024	3,12,097
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.40 (4.04)	322.56	501.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.33 (38.83)	2,65,887	3,11,648

చికెన్ ధరలు | లైవ్ : రూ.130 | డ్రెస్ : రూ.186 | స్కిన్‌లెస్ : రూ.216



చండూరు మండలంలో ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గుంతలు



ట్రాక్టర్లలో తరలుతున్న ఇసుక

- వానాకాలం కావడంతో తగ్గిన లభ్యత
- ఫలితంగా రెట్టింపైన ధర
- రాత్రివేళల్లో అడ్డగోలుగా అక్రమరవాణా
- అక్రమార్కులకు పోలీసు, రెవెన్యూ, రాజకీయనాయకుల అండదండ

ఇసుక బంగారమాయే..!

వర్షాలతో వాగులు, నదుల్లోకి నీరు చేరడంతో ఇసుక లభ్యత తగ్గింది. ఉమ్మడి జిల్లాలో ఇసుకకు ప్రధాన వనరులైన మూసీ, బిక్కేరు, పాలేరు, పెద్దవాగు, తదితర జలవనరులన్నీ నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఇక్కడ ఇసుక తవ్వకాలు తగ్గాయి. ఫలితంగా ఇసుకలభ్యత తగ్గి, ధర ఒక్కసారిగా పెరిగింది. అవసరాలకు ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుక్‌చేసి తరలించే అవకాశం ఉన్నా, ఆశించిన మేర లభించకపోవడంతో వినియోగదారులు బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక ధర ఆన్‌లైన్ ద్వారా రూ.2500 వరకు ఉండగా, బ్లాక్‌లో రూ.4వేలు వెచ్చించాల్సి వస్తోంది. ధర ఎక్కువైనా ఇసుక లభిస్తుండటంతో వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో ఇసుకరవాణా, ధర, అక్రమ తవ్వకాలు, సరఫరాపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

నల్లగొండ జిల్లా కేంద్రానికి నర్సింగ్‌భట్ల, కనగల్ మండలం శేరిలింగోటం రీచ్‌ల నుంచి ఆన్‌లైన్ అనుమతులతో ఇసుకరవాణా జరుగుతోంది. అయితే జిల్లా కేంద్రంలో నిర్మాణాలు ఎక్కువగా ఉండడం, ఆ ఇసుక సరిపోకపోవడంతో హాలియా, రామడుగు వాగుల నుంచి రాత్రివేళల్లో అక్రమంగా రవాణా అవుతోంది. ఈ ఇసుకను ట్రాక్టర్‌కు రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. తప్పనిసరి అవసరాలకు మినహా నిర్మాణదారులు ఇసుక కొనుగోలుచేయలేని పరిస్థితి ఏర్పడింది.

● నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు వద్ద మూసీ నది నుంచి రెవెన్యూశాఖ అనుమతితో ఇసుక రవాణా సాగుతోంది. అనుమతుల పేరుతో అక్రమరవాణా భారీగా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు నెలల క్రితం అమ్మనబోలు వద్ద సీజ్ చేసిన సుమారు 250 ట్రాక్టర్ల ఇసుక డంప్ నుంచి ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని, దీన్ని ప్రభుత్వం వేలం వేయకపోతే సీజ్ చేసిన లక్ష్యం నెరవేరదని స్థానికులు పేర్కొంటున్నారు.

● నకిరేకల్‌లో ఇళ్ల నిర్మాణాలకు శాలిగౌరారం మండలం వంగమర్తి, గురిజాల వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3,500కు విక్రయిస్తున్నారు.

● మూసీ నదికి వరద ఉధృతి పెరగడంతో చెక్‌డ్యామ్‌లు, మూసీ పరివాహకం నీటితో నిండిపోవడంతో కేతేపల్లి మండలంలో ఇసుక లభ్యత తగ్గింది. అయినా కొందరు అక్రమరవాణాదారులు కొప్పోలు, భీమారం నుంచి ట్రాక్టర్ల ద్వారా సూర్యాపేటకు ఇసుకను తరలించి రూ.3,500 విక్రయిస్తున్నారు.

● చండూరు మునిసిపాలిటీలో ఇసుక అక్రమరవాణా దందా యథేచ్ఛగా సాగుతోంది. బ్లాక్ మార్కెట్‌లోనే ఇసుక అధికంగా లభిస్తుండడంతో వినియోగదారులకు భారంగా మారింది. ఆన్‌లైన్‌లో ట్రాక్టర్ ఇసుక రూ.2,500 లోపు ఉండగా, బ్లాక్‌లో రూ.5వేల వరకు విక్రయిస్తున్నారు. మండలంలో ఇసుక డంపులు భారీగా నిల్వ చేశారని, వాటిని స్వాధీనం చేసుకొని వినియోగదారులకు ఆన్‌లైన్ ద్వారా సరఫరా చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మునుగోడు, కొరటికల్ గ్రామాల్లోని పెద్దవాగులో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. వాగుల్లో నీటి ప్రవాహం లేకపోవడంతో ఇసుక ఖాళీ అయింది. ఇక్కడ మట్టిఇసుకనే తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు.

● నిడమనూరు మండలంలో అధికారిక రీచ్‌లు లేకున్నా, రాజన్నగూడెం, సూరేపల్లి, ముప్పారం నుంచి రాత్రివేళ వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.4వేల వరకు వసూలు చేస్తున్నారు.

● దేవరకొండ డివిజన్‌లో ఇసుక అక్రమరవాణాపై అధికారుల పర్యవేక్షణ లోపించింది. అర్ధరాత్రి నుంచి ఉదయం ఆరు గంటలవరకు ఇసుక అక్రమరవాణా జోరుగా సాగుతోంది. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఇసుక నాణ్యతంగా లేకపోవడంతో గృహనిర్మాణదారులు గత్యంతరం లేక దళారుల వద్ద ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. డివిజన్‌లో మైనంపల్లి, తాటికోల్, ముదిగొండ, చింతచెట్టుతండా ప్రాంతాల నుంచి కొండమల్లేపల్లి మీదుగా రోజూ 20 ట్రాక్టర్ల వరకు ఇసుక అక్రమంగా తరలుతోంది. రాత్రివేళ ఇసుక ట్రాక్టర్లు లైట్లు లేకుండా, మితిమీరిన వేగంతో వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గొట్టిముక్కల రీచ్ నుంచి రోజూ ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ట్రాక్టర్ ఇసుక రూ.3,370 వెచ్చించి వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి రోజూ కనీసం 300 ట్రాక్టర్ల ఇసుక సరఫరా అవుతోంది. అయితే ఈ ఇసుకలో నల్లమట్టి కలుస్తోందని, శ్లాబ్‌కు పనికిరావడం లేదని వినియోగదారులు పేర్కొంటున్నారు. నాణ్యమైన ఇసుకను ఆన్‌లైన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన ధరకు అందుబాటులో ఉంచాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. డిండి మండలంలో ఇసుక లభ్యత ఉన్నా, ఇసుక తోడేందుకు అనుమతులు లేవు. వావిల్‌కోల్, కందుకూరు(డి), నెమలిపూర్‌లో ఇసుక అందుబాటులో ఉంది. ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో ఇక్కడి నుంచి అక్రమరవాణా సాగుతోంది. ట్రాక్టర్ ఇసుకకు రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారు.

● తిప్పర్తి, మాడ్గులపల్లి మండలాల్లో పాలేరు వాగు సరిహద్దు గ్రామాలైన మామిడాల, ఆగామోత్కూరు, చిరుమర్తి గ్రామాల నుంచి కల్వలపాలెం నుంచి అక్రమంగా ఇసుకను తిప్పర్తితోపాటు మిర్యాలగూడకు తరలిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆన్‌లైన్ కంటే అక్రమరవాణ ఇసుకనే వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. వేములపల్లి మండలం రావులపెంట వద్ద మూసీ, పాలేరు వాగుల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకున్నవారికి ఆ ధర మేరకు ఇసుక సరఫరా చేస్తే గిట్టుబాటు కావడం లేదని ట్రాక్టర్ల యజమానులు ఇక్కడి నుంచి సరఫరాకు నిలిపివేశారు. అయితే రాత్రివేళ మాత్రం ఈ రీచ్‌ల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇసుక అక్రమరవాణాకు స్థానిక అధికారపార్టీ నాయకుల మద్దతు, పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఎస్‌బీ పోలీసులు రాత్రివేళ తనిఖీలు చేయగా, నాలుగు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి.

యాదాద్రి జిల్లాలో రెట్టింపైన ఇసుక ధర

రాజాపేట మండలంలో ఇసుక ట్రాక్టర్‌కు రూ.4వేలు వసూలు చేస్తున్నారు. గోదావరి ఇసుక మెట్రిక్ టన్నుకు రూ.2,200 ధర ఉంది. మండలంలోని బేగంపేట వాగు నుంచి రాత్రి వేళల్లో జగదేవ్‌పూర్, గజ్వేల్ పట్టణాలకు ఇసుక అక్రమంగా తరలుతోంది. కొందరు అక్రమార్కులు తహసీల్దార్ నుంచి ఒకటి, రెండు ట్రాక్టర్లకు అనుమతి తీసుకొని పది ట్రిప్పుల వరకు ఇసుక తరలిస్తున్నారు.

● అడ్డగూడూరు మండలంలో బిక్కేరు, మూసీ వాగుల నుంచి ఇసుక అక్రమరవాణా సాగుతోంది. మూసీ ఇసుక ట్రాక్టర్‌కు రూ.2,200 ధర ఉండగా, ఇతర ప్రాంతాల ఇసుకను రూ.3,500 వరకు విక్రయిస్తున్నారు. చిర్రగూడూరు, అజీంపేట వాగు నుంచి రాత్రివేళల్లో అడ్డగూడూరు, చౌళ్లరామారం, బొడ్డుగూడానికి ఇసుక రవాణా చేస్తున్నారు.

● గుండాల మండలంలో బిక్కేరువాగు నుంచి ప్రాజెక్టుల పేరుతో అనుమతులు తీసుకొని రాత్రివేళ హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తున్నారు. వాగులు, ఇసుక లభ్యత లేని గ్రామాలకు అధికారులు ఇసుక కేటాయింపులు చేయకపోవడంతో రాత్రివేళ ఇసుక ఉండే ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.7వేల వరకు చెల్లించాల్సి రావడం ఇబ్బందిగా మారింది.

● మోటకొండూరు మండలంలోని బిక్కేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతిరోజూ రాత్రివేళ డంపులకు ఇసుకను చేర్చి, అక్కడ నుంచి తెల్లవారుజామున లారీల్లో తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా కళ్లెదుటే ఇసుక తరలిస్తున్నా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. కొందరు దళారులు అనుమతుల పేరుతో ట్రాక్టర్ల కొద్దీ ఇసుక తరలిస్తున్నారు.

● ఇసుక అక్రమ రవాణాకు ఆలేరు అడ్డాగా మారింది. పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఆలేరు, బిక్కేరు వాగుల్లో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఈ వాగుల నుంచి ఇసుకను ఇష్టారీతిన తవ్వి ఒక్కో ట్రాక్టర్ రూ.4వేలకు విక్రయిస్తున్నారు.

● ఆత్మకూరు(ఎం) మండలంలో అంబాల వాగు నుంచి ఇసుక రవాణా సాగుతోంది. దళారులు రెండు ట్రిప్పుల వరకు అనుమతులు తీసుకొని రోజంతా యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. ట్రాక్టర్‌కు రూ.5వేలు వసూలు చేస్తున్నారు. బిక్కేరులో ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇంటి నిర్మాణాలకు కొందరు గోదావరి ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఇసుక అనుమతి లేఖలకు రెవెన్యూశాఖ కార్యాలయంలో రూ.500, పోలీసులు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

● మోత్కూరు బిక్కేరు వాగు నుంచి ఇసుక తవ్వకాలు జరపకుండా రైతులు కోర్టు నుంచి స్టే తేవడంతో గృహనిర్మాణదారులు ఎడ్లబండ్ల ద్వారా తరలిస్తున్నారు. ఒక్కో బండికి రూ.400 నుంచి రూ.500వరకు చెల్లిస్తున్నారు. ఇసుక కావాలంటే తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్‌కు రూ.420 చలాన్ చెల్లించి, దూరాన్ని బట్టి ట్రాక్టర్ కిరాయి ఇస్తున్నారు. రాత్రి సమయంలో ఇక్కడి నుంచి అక్రమంగా ఇసుక తరులుతోంది. ఒక్కో ట్రిప్పుకు రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో డంప్‌చేసిన ఇసుక విక్రయాలు

మోతె మండలంలోని పాలేరు వాగు నుంచి సమీపంలోని సూర్యాపేట, ఖమ్మం, కోదాడకు ఇసుక తరలుతోంది. రాజకీయ నాయకుల అండదండలు, పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఇసుక అక్రమరవాణా సాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని ఉర్లుగొండ, నరసింహాపురం, తుమ్మగూడెం, అన్నారుగూడెం నుంచి ఇసుక రవాణా అవుతోంది. ఇటీవల పాలేరు జలాశయానికి నీరు చేరడంతో రవాణా తగ్గింది. నీరు లేనప్పుడు రోజుకు వంద ట్రాక్టర్లపైచిలుకు ఇసుకను ఇక్కడి నుంచి తరలించారు. ప్రస్తుతం ఈ గ్రామాల సమీపంలో డంప్ చేసిన ఇసుకను విక్రయిస్తున్నారు. ఇసుక నాణ్యతగా ఉండడంతో ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు. పెన్‌పహాడ్ మండలంలోని నాగులపహాడ్, దోసపహాడ్, అనాజీపురం పరిధిలోని మూసీ నది నుంచి ఇసుక రవాణా నిరంతరాయంగా సాగుతోంది. ప్రస్తుతం మూసీ నదికి వరద వస్తుండడంతో నదిలో ఇసుకతవ్వకాలు నిలిచాయి. అయితే ఇసుక రవాణాదారులు వరదకు ముందే ఇళ్ల, పొలాల వద్ద ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసుకొని ప్రస్తుతం అక్కడి నుంచి తరలించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సన్న ఇసుక ట్రాక్టర్‌కు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ధర పలుకుతుండగా, దొడ్డు ఇసుక ట్రాక్టర్‌కు రూ.2వేల వరకు చెల్లిస్తున్నారు. కళ్లెదుటే ఇసుక అక్రమరవాణా సాగుతున్నా పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కనీసం పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

గుట్టకు తిరుమల తిరుపతి దేవస్థానం తరహా

పాలకమండలి

- యాదగిరిగుట్ట అభివృద్ధిపై సీఎం సమీక్ష
- పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

యాదగిరిగుట్ట అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులెన్ని.. మిగిలినవి ఎన్ని, వాటికి సంబంధించిన వివరాలు అందజేయాలని ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి తరహాలోనే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

●7లో..



కస్టమ్ మిల్లింగ్‌లో రాజీలేదు

వచ్చే నెల 30 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేయాలి : కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన సెప్టెంబరు 30 లోగా గత వానాకాలం, యాసంగికి సంబంధించిన సీఎంఆర్ డెలివరీని మిల్లర్లు పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలోని రైస్ మిల్లర్లతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఆర్ విషయంలో మిల్లర్లు బాధ్యతగా ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లో ధాన్యాన్ని దుర్వినియోగం చేయవద్దన్నారు. ఎవరైనా ధాన్యం విషయంలో అక్రమాలకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన వేలం ధాన్యాన్ని సైతం టెండర్లు పొందిన మిల్లర్లు వెంటనే పూర్తి చేయాలని, దీనిపై వచ్చే బుధవారం సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రానున్న సీజన్‌లో ధాన్యం సేకరణలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు సలహాలు, సూచనలు కోరగా, సన్న ధాన్యం 67శాతం నుంచి 60శాతానికి తగ్గించాలని, 15 రోజుల గడువును పెంచాలని, కొత్త గన్నీ బ్యాగులు ఇవ్వాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రకాల వారీగా కొనుగోలు చేయాలని, వింగ్స్ సాఫ్ట్‌వేర్‌ను సరళీకృతం చేయాలని కోరారు. అంతకుముందు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, వానాకాలానికి 2.16లక్షల మెట్రిక్ టన్నులకు, 1,62,000 మెట్రిక్ టన్నులు సీఎంఆర్‌ను మిల్లర్లు ఇచ్చారని, ఇంకా 54,000 మెట్రిక్ టన్నులు బకాయి ఉందన్నారు. యాసంగికి సంబంధించి 2.21లక్షల మెట్రిక్ టన్నులకు, 1.25లక్షల మెట్రిక్ టన్నులు అప్పగించారన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ హరీష్, పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, ఎఫ్‌సీఐ క్వాలిటీ కంట్రోల్ ఏజీఎం రాఘవేంద్రసింగ్, మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నారాయణ, మిర్యాలగూడ రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, భద్రాద్రి, బాబి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి: జిల్లాలో ఎల్‌ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎల్‌ఆర్ఎస్ బృందాలతో సమన్వయం చేసుకుని దరఖాస్తులను పరిష్కారించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ హాజరుకాని దేవరకొండ, నకిరేకల్ మునిసిపల్ కమిషనర్లు, టీపీవో ఇంజనీరు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. ఓటర్ల జాబితాను టీపోల్ పోర్టర్‌లో మెర్జింగ్, మ్యాపింగ్‌ను సెప్టెంబర్ 3వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా శానిటేషన్, ప్లాంటేషన్‌పై ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

- గంధమల్ల, బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల పునరుద్ధరణకు నిధులు మంజూరు
- భూసేకరణ బాధ్యత ఎమ్మెల్యేలదే
- భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

యాదాద్రి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సాగునీటి కాల్వలను పూర్తిచేసి సస్యశ్యామలం చేస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం భువనగిరిలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గంధమల్ల రిజర్వాయర్‌ను 1.41టీఎంసీలతో నిర్మిస్తామని, బునాదిగాని కాల్వకు రూ.269, పిలాయిపల్లికి రూ.86కోట్లు, ధర్మారెడ్డి కాల్వకు రూ.133కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సాగునీటి ప్రాజెక్టులకోసం అవసరమైన భూసేకరణను ఎమ్మెల్యేలు బాధ్యతగా తీసుకుని పూర్తి చేయాలన్నారు. భూసేకరణ పూర్తయితే సంవత్సరంలోనే లక్ష ఎకరాల మేరకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలోని లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, లిఫ్ట్ ఇరిగేషన్లు, చెక్‌డ్యాంలు పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడైనా చెరువులను అక్రమిస్తే ఉపేక్షించేదిలేదని, ఎంతటివారిపైనా చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతం మంత్రిగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ కూడా పూర్తి చేసే బాధ్యత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీసుకుంటారని తెలిపారు. సమావేశంలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భువనగిరి పార్లమెంట్ సాగునీటి పారుదల ప్రాజెక్టుల పనులను వివరించారు.



సాగునీటి పనులు వెంటనే చేపట్టాలి: ఎమ్మెల్యేలు

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు, భువనగిరి ప్రాంతాలను సాగునీటి పరంగా అభివృద్ధి చేయాలని, గత 10ఏళ్లలో ఈ ప్రాంతానికి నీరు ఇవ్వలేదన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వల వెడల్పును పెంచాలన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ మూసీ వ్యర్థాలతో ఈ ప్రాంత ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని, మానవాళికి ముప్పు వస్తుందని, గంగా ప్రక్షాళన మాదిరిగా మూసీ ప్రక్షాళన చేయాలన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బస్వాపూర్ ప్రాజెక్టు 90శాతం పూర్తయిందని, తిమ్మాపూర్ వాసులకు పునరావాసం ప్యాకేజీతో పాటు పరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ ఆసిఫ్‌నెహార్, ఎస్సారెస్పీ కాల్వల ద్వారా చెరువులను నింపాలని, కేతిరెడ్డిప్రాజెక్టు కాల్వను తీస్తే ఎనిమిది గ్రామాలకు 30వేల ఎకరాలు సాగునీరు అందుతుందన్నారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్ల కాళేశ్వరం ప్రాజెక్టుపై రూ.లక్షలకోట్లు ఖర్చుచేశారని, ఈ ప్రాంతానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ శివన్నగూడెం ప్రాజెక్టు ద్వారా నాలుగు మండలాలకు సంబంధించిన సాగునీటి పనులు పూర్తిచేయాలన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ అయిటిపాముల, బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్‌లను పూర్తి చేస్తే 61వేల ఎకరాలకు సాగునీరందుతుందని, ఇందుకోసం రూ.250కోట్లు కేటాయించాలన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ధర్మసాగర్‌నుంచి గండిరామారం లిఫ్టు పనులు చేపట్టాలని, 90వేల ఎకరాలకు నీళ్లు వస్తాయని తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తోపాటు ఉన్నతాధికారులు, కలెక్టర్ హనుమంతు కే.జెండగే పాల్గొన్నారు.

భువనగిరిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, విప్ అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

నకిరేకల్‌లో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం



కోర్టును ప్రారంభిస్తున్న జిల్లా న్యాయాధికారి నాగరాజు

నకిరేకల్, ఆగస్టు 30: నకిరేకల్ ఆఫీసర్స్ క్లబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా న్యాయాధికారి ఎం.నాగరాజు శుక్రవారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా జడ్జి వి.వేణు, ఫ్యామిలీకోర్టు జడ్జి డి.దుర్గాప్రసాద్, సీనియర్ సివిల్ సెషన్‌కోర్టు జడ్జి డీవీఆర్ తేజోకార్తిక్, నకిరేకల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే.ఆరీఫ్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజార్ల శంభయ్య, మంగ సైదులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 5 కేసులను విచారించారు. ఈ సందర్భంగా జడ్జిలను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

హెచ్‌ఐవీ నిర్ధారణ లక్ష పరీక్షలు లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 30: హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు హెచ్‌ఐవీ నిర్ధారణ లక్ష పరీక్షలు చేయడమే లక్ష్యంగా కార్యచరణ రూపొందించామని డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 170 మందికి పరీక్షలు నిర్వహించి అవగాహన సమావేశంలో మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాన్ని సెప్టెంబరు 1 నుంచి అక్టోబరు 31వ తేదీ వరకు పూర్తిచేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో జిల్లాను హెచ్‌ఐవీ రహితంగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నోడల్ అధికారి డాక్టర్ రాజేష్‌కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ సుధాకర్, ప్రేమ్‌నాథ్, తిరుమలాచారి, శైలజ, జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

గుట్టలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 30: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మహిళలు ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం ఉచితంగా వ్రతాలు జరపడం ఆచారంగా వస్తోంది. కొండకింద సత్యదేవుని వ్రత మండపంలో దేవస్థానం ఉచితంగా అమ్మవారి వ్రతాలు జరుపుకునే అవకాశం కల్పించారు. అందుకు తగినట్లు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అంతకుముందు వరలక్ష్మీ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేసిన ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి వ్రతాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పర్యవేక్షకులు, అధికారులు పాల్గొన్నారు.




వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మహిళలు, పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆండాల్ అమ్మవారికి ఊంజల్ సేవ

స్వామివారి సన్నిధిలో స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమశాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన పూజారులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాల్ అమ్మవారిని పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకస్వాములు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమపద్ధతిలో చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.29,99,608 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, సంగీత సభల్లో భాగంగా అభ్యుదయ కళాసమితికి చెందిన భాస్కరశర్మ (హైదరాబాద్) భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు.



అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా, అద్భుతమైన ఆలయంగా రూపుదిద్దుకున్న మహిమాన్విత స్వయంభు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిపాలనా విధానాన్ని మార్చాలని గత బీఆర్ఎస్ సర్కార్ యోచించింది. అయితే ప్రభుత్వ సంకల్పం కార్యరూపం దాల్చలేదు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా యాదగిరిగుట్టలో కుర్చీవేసుకుని భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు యాదగిరిగుట్ట అభివృద్ధి పనులపై శుక్రవారం సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా కీలక ఆదేశాలు జారీచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు మాదిరిగా యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డును ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో పెండింగ్ పనుల వివరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన పనులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విమాన గోపురానికి బంగారు తాపడం పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించిన పూర్తి నివేదికను ఇవ్వాలని ఆదేశించారు.

(ఆంధ్రజ్యోతి- యాదాద్రి)


గుట్టకు టీటీడీ తరహా పాలకమండలి

● నిర్ణయం తీసుకున్న సర్కారు ● ఈవోగా ఐఏఎస్ అధికారిని నియమించాలన్న యోచన ● వైటీడీఏ ప్రక్షాళన

తెలంగాణ తిరుపతిగా పేరు ప్రఖ్యాతిగాంచిన స్వామివారి ఆలయానికి రోజురోజుకు భక్తుల తాకిడి పెరిగిపోతోంది. గతంలో పాతగుట్టతో పాటు బాలాలయానికి రోజువారీగా 6వేల మంది, సెలవు రోజుల్లో మాత్రం 30వేలకు పైగా భక్తులు ఆలయానికి విచ్చేసేవారు. ఆలయ పునర్నిర్మాణం అనంతరం రోజువారీగా స్వామివారిని 10వేల మంది, సెలవు రోజుల్లో 40 నుంచి 50 వేల వరకు భక్తులు ఆలయాన్ని సందర్శించి, పలు కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. భవిష్యత్‌లో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అదేస్థాయిలో భక్తులకు సౌకర్యాలు ఏర్పాటుచేయాల్సి ఉంటుంది. అయితే ప్రస్తుతం ఉన్నటువంటి పరిపాలనా విధానంతో ఆలయ నిర్వహణ సాధ్యం కాకపోవచ్చని, ప్రత్యేక మండలిని ఏర్పాటుచేయాలని యోచిస్తోంది. ఆలయానికి ఉన్నతస్థాయి అధికారిని ఎగ్జిక్యూటివ్(ఈవో) అధికారిగా నియమించాలని, ఎస్ఎల్ఎన్ఎస్ ఆలయ ఈవోగా(అప్పటి ఈవో ఎన్.గీత) పదవీ విమరణ పొందిన అధికారి పర్యవేక్షణలో కొనసాగుతుందని, ప్రభుత్వం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అప్పటి ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శాసనసభలో ప్రశ్న లేవనెత్తారు. అయినప్పటికీ కూడా ప్రభుత్వం ఆలయ పరిపాలన మార్పుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ మేరకు ప్రభుత్వం గుట్టకు మండలిని ఏర్పాటుపై ప్రభుత్వంలో కదలిక వచ్చింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పాలకమండలిని ప్రభుత్వం నియమించిన పక్షంలో ప్రస్తుతం ఉన్నటువంటి పాలనలో భారీగా మార్పులు చోటుచేసుకుంటాయి. పాలకమండలిని నియమించిన పక్షంలో చైర్మన్‌తో పాటు సభ్యులు, ఉన్నతాధికారుల పర్యకవేక్షణ కొనసాగుతోంది.

రూ.1280 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం

తెలంగాణ తిరుపతిగా పేరొందిన లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దాదాపుగా రూ.1280కోట్లతో పునర్నిర్మాణంతో పాటు ఆలయ విస్తరణ పనులు చేపట్టింది. ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి, విస్తరించిన ఆలయ నిర్వహణ సక్రమంగా సాగేలా తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) తరహాలో యాదగిరిగిరిగుట్టకు ప్రత్యేక ఆలయ మండలిని ఏర్పాటుచేసే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. ప్రధానాలయ ఉద్ఘాటన 2022 మార్చి 28న జరిగిన అనంతరం ప్రభుత్వం పాలకమండలి ఏర్పాటు చేస్తారన్న ప్రచారం జరిగింది. గతంలో మండలి ఏర్పాటుపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు, ఉన్నతాధికారులతో సమాలోచనలు చేసినట్టు సమాచారం. టీటీడీ తరహాలో పాలకమండలి ఏర్పాటుపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం ఆలయ నిర్వహణ బాధ్యతలు దేవాదాయ శాఖతో పాటు వైటీడీఏ పర్యవేక్షిస్తోంది. వైటీడీఏ చైర్మన్‌గా సీఎం కొనసాగుతుండగా, వైస్‌చైర్మన్ కిషన్‌రావు కొనసాగుతున్నారు. వైస్‌చైర్మన్ కూడా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. అయితే సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకోవడంతో వైటీడీఏలోనూ మార్పులు చేసుకుంటాయని అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ మేరకు వైటీడీఏ ప్రక్షాళన చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



ఈవోగా ఉన్నతాధికారి

ఆలయానికి ప్రస్తుతం ఈవో పరిపాలనా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి 1940 నుంచి కొనసాగుతోంది. దేవాదాయ శాఖలోని ఈవోగా అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, జాయింట్ కమిషనర్, డిప్యూటీ కలెక్టర్(రెవెన్యూ)ల వరకు విధులు నిర్వర్తించారు. అయితే ప్రభుత్వం టీటీడీ తరహాలో ఈవోగా ఐఏఎస్ అధికారిని నియమించిన పక్షంలో, ఆలయ పాలనకు అనుగుణంగా పలు శాఖలు రానున్నాయి. విద్యుత్‌తో పాటు సివిల్ వర్క్స్, తదితర ఇంజినీరింగ్ శాఖలు ప్రత్యేకంగా ఏర్పాటు కానున్నాయి. భారీగా ఆలయ విస్తరణ చేపట్టిన నేపథ్యంలో రానున్న రోజుల్లో 1000 ఎకరాల టెంపుల్ సిటీలో 250 కాటేజీలను నిర్మించాల్సి ఉంది. విద్యుత్ శాఖకు చీఫ్ ఇంజినీర్(సీఈ)స్థాయి అధికారిని నియమించి, ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు చుట్టుపక్కల్లో ఉన్నటువంటి అన్ని దేవాలయాలకు యాదగిరిగుట్ట కేంద్రంగానే విద్యుత్ పరికరాలతో పాటు కొత్తలైన్ల ఏర్పాటు ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నారు. భవనాల నిర్మాణాలు, రోడ్లు, డ్రైనేజీ, తదితర నిర్వ హణతో పాటు మంచినీటి సౌకర్యం, పారిశుధ్యం వంటి పనులు చేపట్టేందుకు ఆయాశాఖల కూడా ఉన్నతాధికారిని నియమించే అవకాశం ఉంటుంది.

పనులు వేగవంతం చేయండి : సీఎం

భువనగిరి అర్బన్ : తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదగిరిగుట్ట ఆలయానికి సంబంధించి పాలక మండలి నియమించనున్నట్లు సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లో యాదగిరిగుట్ట అభివృద్ధిపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా పెండింగ్ పనుల వివరాలు, వైటీడీఏకు సంబంధించి పూర్తిస్థాయి నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఆలయ దివ్య విమాన రాజగోపురానికి బంగారం తాపడం పనులు వేగవంతం చేయాలని కీలకఆదేశాలు సీఎం జారీ చేశారు. కాగా, పెద్దగుట్టపై టెంపుల్ సిటీ నిర్మాణం ఇంకా మొదలు కాకపోగా కొండకింద దక్షణ దిక్కు నుంచి నిర్మాణంలో ఉన్న రూ.34 కోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి రూ.15కోట్ల పనులు, పూర్తిగా నిర్మాణం కానీ రూ. 63కోట్లు వర్తకులు, నిర్వాసితుల కోసం దుకాణ సముదాయాలు రూ.18కోట్లు, రూ.10కోట్లతో చేపట్టిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం పనులు రూ.5కోట్ల పనులు పెండింగ్‌లోనే ఉండగా ఇందుకు సంబంధించి నిధులు అవసరం ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రత్యేక ఆకర్షణగా ఉండేందుకు దివ్య విమాన రాజగోపురానికి 2025 వార్షిక బ్రహ్మోత్సవాల వరకు బంగారు తాపడం చేయాలని ఆలయ అధికారులు ఇది వరకే సంకల్పించారు.



ఆలయంలో 2.500వేల కిలోల వెండి ఉండగా బంగారంలోకి మార్చితే 16కిలోల బంగారు అందుబాటులోకి రాగా దీనికి తోడుగా ఇది వరకే 10కిలోల బంగారం ఉంది. కానుకల రూపంలో హుండీ కానుకల ద్వారా వచ్చిన మిశ్రమ బంగారం 10కిలోలు కలిపి మొత్తం 36కిలోల బంగారం ఉందని ఈవో భాస్కర్‌రావు తెలిపారు. అలాగే రూ.20 కోట్ల నగదు ఉండగా అందులో రూ.15కోట్లతో 20కిలోల బంగారం కొనుగోలు చేసేందుకు అవకాశం ఉన్నట్లు చెప్పారు.



అనుమానం ఆయువు తీసింది

● హత్యకేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 30: వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానంతో వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన నల్లగొండజిల్లా మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామంలో జరిగింది. కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. వివరాలను డీఎస్పీ రాజశేఖర్‌రాజు శుక్రవారం వెల్లడించారు. ఐలాపురం గ్రామానికి చెందిన బాణావత్ జాను(40) అవివాహితుడు మిర్యాలగూడ రైల్వేస్టేషన్‌లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. జాను నివాసముంటున్న ఇంటినుంచి దుర్వాసన రావడంతో ఈనెల 28న స్థానికులు బాణావత్ శంకర్. లింగా ఇంట్లోకి వెళ్లి చూశారు. మంచంలో కుళ్లిపోయేదశలో ఉన్న జాను మృతదేహాన్ని గుర్తించిన సదరు వ్యక్తులు అతని సోదరుడు బాణావత్ కృష్ణకు ఫోన్‌లో సమాచారమిచ్చారు. మిర్యాలగూడలో నివాసముంటున్న కృష్ణ తన సోదరుడు జాను మృతదేహాన్ని పరిశీలించగా తలపై బలమైన గాయం ఏర్పడి రక్తస్రావం జరిగి ఉండడాన్ని గమనించినట్లు డీఎస్పీ తెలిపారు. జాను ఇంటికి సమీపవాసులైన దరావత్ నాగమణి అలియాస్ నాగమ్మ, బాణావత్ సతీష్ కళ్లిపోయిన శవం నుంచి దుర్వాసన తట్టుకోలేకపోతున్నామంటూ రాద్ధాంతం చేయడంతో మృతదేహాన్ని అదేరోజు మృతుడి సోదరుడు స్థానికుల సాయంతో భూస్థాపితం చేశాడు. తలపై ఏర్పడ్డ గాయాన్ని అనుమానించిన మృతుడి సోదరుడు కృష్ణ ఈనెల 28న రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రూరల్ సీఐ వీరబాబు పర్యవేక్షణలో దర్యాప్తు ప్రారంభించి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. ఐలాపురం తండాకు చెందిన బాణావత్ అంజమ్మ అలియాస్ అంజి అనే మహిళతో జాను వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లుగా ఆమె కుమార్తె, కుమారుడు అనుమానించారు. ఆ కోపంతో జానును హత్యచేసేందుకు పథకం పన్నారు. ఈ నెల 25న జాను ఒంటరిగా ఇంట్లో నిద్రిస్తుండడాన్ని సోదరి, సోదరుడు గమనించారు. నాగమణి, సతీష్‌లు జాను ఇంట్లోకి ప్రవేశించి బండరాయితో తలపై మోది హతమార్చి ఊర్లోనే ఉంటూ అమాయకంగా ప్రవర్తించారు. విచారణలో నిందితులు నాగమణి, సతీష్‌లు తాము చేసిన హత్యా నేరాన్ని అంగికరించినట్లు డీఎస్పీ తెలిపారు. దీంతో నిందితులపై కేసునమోదుచేసి రిమాండ్‌కు పంపారు. .

బుద్ధవనం సందర్శనకు బౌద్ధ భిక్షువుల ఆహ్వానం

నాగార్జునసాగర్, ఆగస్టు 30: థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని వాట్ త్రెమిక్‌లో ఉన్న ప్రబుద్ధ మహాసువర్ణ ప్రతిమారక బౌద్ధాలయ బౌద్ధ భిక్షువులను నాగార్జునసాగర్‌లో ఉన్న బుద్ధవనం సందర్శనకు రావాలని బుద్ధవనం అధికారి, ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆహ్వానించారు. బ్యాంకాక్‌లో మహారాణి సిరికిటీ నేషనల్ పసిఫిక్ ఆసియా ట్రావెల్ ఏజెన్సీ(పాటా)లో జరుగుతున్న 50వ సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరుఫున శివ నాగిరెడ్డి పర్యాటక శాఖ ప్రతినిధిగా అక్కడికి వెళ్లారు. పాటా సమావేశంలో రాష్ట్రం తరుపున పర్యాటక అభివృద్ధి సంస్థ 'వెల్‌కమ్ టు' బుద్ధవనం పేరిట ఏర్పాటు చేసిన స్టాల్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణరావు ప్రారంభించారు. 800మంది అంతర్జాతీయ పర్యాటక ప్రతినిధులు ఈ స్టాల్‌ను సందర్శించినట్లు తెలిపారు. బుద్ధవనం విశేషాలను శివనాగిరెడ్డి గోల్డెన్ బుద్ధ ఆలయంలోని బౌద్ధ భిక్షువులను కలిసి వివరించి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించాలని ఆహ్వానించారు. ఆచార్య నాగార్జునుడు నడియాడిన ప్రదేశం నాగార్జునసాగర్‌లో నిర్మించిన బుద్ధవనం బ్రోచర్‌ను వారికి అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు మహేష్, సరిత, ప్రభాకర్ పాల్గొన్నారు.



బౌద్ధ భిక్షవులను కలిసిన శివనాగిరెడ్డి

లారీ ఢీకొని యువకుడు మృతి

తిప్పర్తి, ఆగస్టు 30: లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ సమీపంలోని రైతు వేదిక సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని మర్రిగూడ గ్రామానికి చెందిన మండల శివ(25) ద్విచక్ర వాహనంపై నల్లగొండ పట్టణానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ సమీపంలోని రైతు వేదిక సమీపంలోకి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. డి రాజు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

గజ్వేల్, ఆగస్టు 30: గొంతులో కత్తి పొడుచుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్లలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా మన్నెవారి తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన ఎరుకల రాజయ్య(65) డయల్ 100కు ఫోన్‌చేసి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకోగా కత్తితో గొంతులో పొడుచుకోవడం గమనించారు. ఒంటిపై రక్తంతో పడి ఉన్న రాజయ్యను వెంటనే 108 అంబులెన్స్‌లో గజ్వేల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పరిశ్రమలో పేలిన రియాక్టర్

● కార్మికులు లేకపోవడంతో తప్పిన ప్రాణనష్టం
● పేలుడు ధాటికి ఎగిసిన మంటలు, వ్యాపించిన పొగలు
● నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో ఘటన

చిట్యాలరూరల్, ఆగస్టు 30: పశువులకు ఇచ్చే మందులు తయారు చేసే ఫార్మా ల్యాబ్‌లో రియాక్టర్ పేలి పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులోని శ్రీపతి ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీపతి ఫార్మా ల్యాబ్‌లో వెటర్నరీ మందులు తయారు చేస్తారు. ల్యాబ్‌లో మొత్తం కార్మికులు 47మంది పనిచేస్తుంటారు. రోజువారీ పనుల్లో భాగంగానే ల్యాబ్‌లో రెండు బ్లాకుల్లో కార్మికులు విధుల్లో ఉన్నారు. ప్రతి బ్లాకులో ఆరుగురు చొప్పున పనిచేస్తుంటారు. మిగితా కార్మికులు ఇతర విభాగాల్లో పనుల్లో ఉంటారు. మొదటి అంతస్తులోని బ్లాక్-2లో సుమారు ఆరు రియాక్టర్లు ఉన్నాయి. అందులోని రసాయనాలతో బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి చేస్తుంటారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆరుగురు కెమిస్టులు, ఇద్దరు సహాయకులు ఉన్నారు. షిఫ్టు మారేందుకు ఐదుగురు బయటకు వెళ్లారు. రియాక్టర్‌కు అనుసంధానమైన పైపులైన్లలోని రసాయనాలు లీకవ్వడంతో ఉదయం సుమారు 8.30గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అక్కడున్న ముగ్గురు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. వారు బయటకు వెళ్లిన కొద్దిసేపటికే రియాక్టర్ పేలి పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. కంపెనీలోని ఇతర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు కూడా పేలుడు శబ్దానికి దూరంగా పరుగులు తాశారు. ఈ ప్రమాదంలో కార్మికులకు ఎలాంటి గాయాలు కాలేదు. పేలుడు సమయంలో కార్మికులు లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సమాచారం తెలుసుకున్న నార్కట్‌పల్లి సీఐ కె.నాగరాజు అక్కడికి చేరుకొని చిట్యాల ఎస్ఐలు ఎన్.ధర్మ, కె.లింగయ్య, నార్కట్‌పల్లి, మునుగోడు ఎస్ఐలు క్రాంతి, వెంకటేశ్వర్లుతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులను రప్పించారు. చౌటుప్పల్, రామన్నపేట అగ్నిమాపక సిబ్బంది సకాలంలో వచ్చి మంటలు ఆర్పడంతో ప్రమాద తీవ్రత తగ్గింది. ల్యాబ్‌లో రియాక్టర్ పేలుడు ధాటికి భవనం ధ్వంసమైంది. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ ప్రమాదంపై విచారణ జరుపుతున్నామని, కారణాలు తెలుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరాతో షార్ట్‌సర్క్యూట్ లేక రియాక్టర్ పేలుడు కారణమా అనేది విచారణలో తేలుతుందన్నారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని, కేసు నమోదు చేసి విచారణ చేపడతామన్నారు.



పేలుడుకు దట్టంగా వ్యాపించిన పొగలు



మంటలు ఆర్పుతున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



ల్యాబ్‌లో పేలుడుకు ధ్వంసమైన భవనం

తల్లిదండ్రుల చెంతకు వెళ్లిన యువతి

● నవదంపతుల అపహరణ కేసు ● ఒక్క రోజులోనే ముగిసిన ఇన్‌స్టాగ్రాం ప్రేమ పెళ్లి

చౌటుప్పల్ రూరల్ ఆగస్టు 30: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తాళ్లసింగారంలో నవదంపతుల అపహరణలో యువతి ప్రియుడికి షాక్ ఇచ్చింది. ప్రియుడి వెంటే వెళ్తానని గురువారం చెప్పిన యువతి ఒక్కరోజులోనే మనస్సు మార్చుకుంది. తల్లిదండ్రుల వద్దకే వెళ్తానని, ప్రియుడి ఒత్తిడితోనే పెళ్లి చేసుకున్నానని చౌటుప్పల్, రామన్నపేట మెజిస్ట్రేట్‌ల ఎదుట శుక్రవారం వాంగ్మూలం ఇచ్చింది. సాయంత్రం ఇంటికి చేరుకుంది. రామన్నపేట మండలం ఎల్లంకి గ్రామానికి చెందిన యువతి, చౌటుప్పల్ మండలం తాళ్లసింగారం గ్రామానికి చెందిన యువకుడు ఇన్‌స్టాగ్రాం ద్వారా పరిచయమయ్యారు. వీరి ప్రేమ పెళ్లికి దారితీసింది. గురువారం ఉదయం యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. తర్వాత పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. యువతి తరుపు కుటుంబసభ్యులు అంగీకరించలేదు. తాను ప్రియుడితోనే ఉంటానని, రక్షణ కల్పించాలని చెప్పి యువతి పోలీసు వాహనంలో వెళ్లిపోయింది. తాళ్లసింగారం క్రాస్‌రోడ్డు వద్ద అమ్మాయి తరుపు బంధువులు పోలీసు వాహనాన్ని అడ్డుకొని నవ వధువులను అపహరించారు. ప్రియుడిని కొట్టి వదిలివేశారు. ఆదే రోజు రాత్రి మళ్లీ పోలీసులు యువతిని తీసుకొచ్చి సఖీ కేంద్రంలో ఉంచారు. శుక్రవారం ఉదయం యువతి మనస్సు మార్చుకుంది. తల్లిదండ్రుల వద్దకు వెళ్తానని పోలీసులకు తెలిపింది. పోలీసులు యువతిని చౌటుప్పల్, మెజిస్ట్రేట్‌ల ఎదుట హాజరుపరిచి వాంగ్మూలం తీసుకున్నారు.

తాను తల్లిదండ్రుల వద్దకు వెళ్తానని చెప్పడంతో యువతిని పోలీసులు తల్లిదండ్రుల వద్దకు పంపించారు. ప్రియుడు తన ఇంటికి వెళ్లిపోయాడు. చౌటుప్పల్ మండలం తాళ్లసింగారంలో పోలీసు వాహనం అడ్డగించి నవదంపతులను అపహరించిన కేసులో యువతి బంధువులు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మదరావు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

కట్టంగూరు, ఆగస్టు 30: దొంగతనాలకు పాల్పడుతూ గంజాయి, బంగారం తరలిస్తున్న అంతరాష్ట్ర నిందితుడిని కట్టంగూరు పోలీసులు శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి కట్టంగూరు పోలీస్‌స్టేషన్‌లో కేసుకు సంబంధించిన వివరాలను సీఐ కొండల్‌రెడ్డి, ఎస్ఐ ఎన్. శ్రీనుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏలూరు జిల్లా జంగారెడ్డి మండలం జంగారెడ్డి గ్రామానికి చెందిన పోలవరపు నాగదుర్గ ప్రసాద్ భీమవరం జిల్లా తాడేపల్లిగూడెం గ్రామానికి చెందిన యరసాని లక్ష్మణ్, శ్రీను, రాజీవ్ కలిసి ఈ నెల 28న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నందిగామ పట్టణంలో రెండు ఇళ్లల్లో దొంగతనాలు చేశారు. ఆ బంగారాన్ని హైదరాబాద్‌లో విక్రయించేందుకు రెండు ద్విచక్ర వాహనాలపై బయలు దేరారు. మార్గమధ్యలోని కట్టంగూరు గ్రామ శివారులో హైవే పక్కన ఈ నెల 29న సాయంత్రం ఆగి గంజాయి సేవిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కట్టంగూరు ఎస్ఐ శ్రీను నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాలను గమనించారు. అనుమానంతో వెంటనే తన సిబ్బందితో వారిని వెంబడించారు. ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్‌పై తప్పించుకోగా, పోలవరపు నాగదుర్గ ప్రసాద్ పట్టుబడ్డాడు. పట్టుబడిన నిందితుడు కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ చేతిని కొరికి తప్పించుకోవడానికి ప్రయత్నించగా మరో కానిస్టేబుల్ దుర్గప్రసాద్ నిందితుడిని పట్టుకున్నారు. అక్కడికి చేరుకున్న ఎస్ఐ నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వ్యక్తి వద్ద నుంచి రూ.7500, 500 గ్రాముల గంజాయి 14.73తులాల బంగారు అభరణాలు, రూ.30వేల నగదు, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌తో కలిపి మొత్తం రూ.12లక్షలు విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు పట్టుబడిన నేరస్తుడు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో 30కిపైగా దొంగతనం కేసుల్లో ముద్దాయి అని తెలిపారు. కొన్ని కేసుల్లో శిక్ష అనుభవించి వారం రోజుల క్రితం రాజమండ్రి జైలు నుంచి బయటకు వచ్చి తనకు తెలిసిన పాత నేరస్తులు, స్నేహితులతో కలిసి మళ్లీ దొంగతనాలకు పాల్పడడంతో అరెస్టు చేసి నల్లగొండ కోర్టులో రిమాండ్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న యరసాని లక్ష్మణ్, శ్రీను, రాజీవ్‌లను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. ప్రాణాలకు తెగించి నేరస్థులను పట్టుకోవడంలో చొరవ చూపిన కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్, దుర్గప్రసాద్‌ను ఎస్పీ శరత్ చంద్రపవార్ రివార్డు అందజేసి అభినందించారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది సతీష్, మల్లేష్, శంకర్, సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, దుర్గప్రసాద్ ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

లండన్‌లో తవక్లాపూర్ గ్రామవాసి మృతి

డిండి, ఆగస్టు 30: ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన నల్లగొండ జిల్లా డిండి మండలంలోని తవక్లాపూర్ గ్రామానికి చెందిన యువకుడు అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల వెంకటేశ్వరరావు, రజిత దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శ్రీకాంత్‌రావు(28) ఉన్నత చదువుల కోసం 2020లో లండన్ వెళ్లాడు. ఎంఎస్ మొదటి సంవత్సరం చదువుతుండగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతడి స్నేహితులు వైద్య పరీక్షలు జరిపించగా బ్లడ్ క్యాన్సర్‌గా నిర్ధారణ అయింది. అక్కడే మెరుగైన చికిత్స అందుతుందని స్నేహితులు సూచించడంతో శ్రీకాంత్‌రావు అక్కడే ఉండిపోయాడు. చదువును మధ్యలోనే ఆపేసి చికిత్స తీసుకుంటుండగా, ఈ నెల 21న తీవ్ర అనారోగ్యానికి గురై మృతిచెందాడు. విషయాన్ని అతడి స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ నెల 31న శ్రీకాంత్‌రావు మృతదేహాన్ని స్వగ్రామం తవక్లాపూర్ తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తవక్లాపూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.



శ్రీకాంత్‌రావు (ఫైల్)

చికిత్సపొందుతూ ట్రైనీ కానిస్టేబుల్ మృతి

చింతపల్లి, ఆగస్టు 30: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ట్రైనీ కానిస్టేబుల్ చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి గ్రామానికి చెందిన పాలకూర్ల సత్తయ్య, వెంకటమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. రెండో కుమారుడు పాలకూర్ల ఆంజనేయులు(24) హైదరాబాద్‌లోని గోషామహల్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో శిక్షణలో ఉన్నాడు. సెలవుల్లో ఈ నెల 25వ తేదీన స్వగ్రామానికి వచ్చాడు. ఈ నెల 28న తన వ్యవసాయ పొలం వద్ద స్నానం చేయ డానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. పొలం సమీపంలో పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయి పడిపోయాడు. వ్యవసాయ పనుల కోసం పొలం వద్దకు వెళ్లిన తండ్రి కుమారుడిని చూసి వెంటనే మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఉన్న కేర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శుక్రవారం ఉద యం మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మానసిక స్థితిసరిగ్గా లేక, జీవితంపై విరక్తిచెంది తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆంజనేయులు(ఫైల్)

కుక్కల దాడిలో నలుగురికి గాయాలు

మునుగోడు రూరల్, ఆగస్టు 30: కుక్కల దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని పలివెల గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన బత్తుల వెంకన్న, జక్కుల వెంకటేష్, చెరుపెల్లి రాములు, మహేష్‌లపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రికి తరలించారు.

విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన ప్రభుత్వం : ఏబీవీపీ



సమావేశంలో మాట్లాడుతున్న చింతకాలయ ఝాన్సీ

నల్లగొండ, ఆగస్టు 30: ప్రభుత్వాలు గడిచిన పదేళ్లలో విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు నిరుద్యోగులకు అన్యాయం చేశారని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం విద్యార్థులు, ఉద్యోగులు ముందుండి అనేక ఉద్యమాలు చేసి ప్రాణాలర్పించి స్వరాష్ట్రం సాధించుకుంటే నిరాశే మిగిలిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ల ఆశ చూపడంతో సంవత్సరాల తరబడి నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో ఫీజులు కడుతూ ఒకపూట పస్తులు ఉండి చదువుకున్నారని అన్నారు. నోటిఫికేషన్లు కూడా సక్రమంగా నిర్వహించలేదన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఈ నెల 31, సెప్టెంబరు 1వ తేదీన రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యారంగ సమస్యలపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించనున్నట్లు ఝాన్సీ తెలిపారు. సమావేశంలో ఏబీవీపీ నల్లగొండ విభాగ కన్వీనర్ సుర్వి మణికంఠ, జూపల్లి దీపిక, ఆవుల సంపత్, శివకృష్ణ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు

● అదనపు ఎస్పీ శ్రీరాములునాయక్


ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేస్తున్న ఏఎస్పీ శ్రీరాములునాయక్

వేములపల్లి, ఆగస్టు 30: నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అదనపు ఎస్పీ శ్రీరాములునాయక్ అన్నారు. మండల పరిధిలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై గల పలు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను శుక్రవారం ఆయన నామ్, పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించి తగు సూచనలు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా గతంలో జరిగిన పలు ప్రమాదాల దృష్ట్యా భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నామ్ అధికారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు నియమాలకు అనుగుణంగా వాహనదారులు నిర్ణీత వేగంతో ప్రయాణిస్తే ఎలాంటి అపాయాలు దరికి చేరవన్నారు. కార్యక్రమంలో వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది ప్రేమ్‌సింగ్, నామ్ అధికారులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా : సీపీఐ

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 30: నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని కోరుతూ సెప్టెంబరు 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి బంటు వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను అంటగట్టడంతో పాటు ధరలు నియంత్రించాలని కోరారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నాకు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సయీద్, లింగానాయక్, యాదగిరి, రామలింగం, వెంకన్న, షమీం, వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి


ఏరియా ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆరోగ్యమిత్రలు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 30: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్రలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం విధులకు హాజరైన ఆరోగ్యమిత్రలు భోజన విరామం సమయంలో స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ డివిజన్ అధ్యక్షుడు బషీరుద్దీన్ మాట్లాడుతూ 17 ఏళ్లుగా ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం అమలులో కీలకపాత్ర పోసిస్తున్నామని అన్నారు. ఆరోగ్యమిత్రలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించి నెలసరి వేతనం రూ.23 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా విధులు బహిష్కరించి సెప్టెంబరు 2,3 తేదీల్లో హైదరాబాద్ ట్రస్టు కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యోమిత్రలు చెన్నబోయిన సుజాత, సుధాకర్, ఇందిర, పేరెల్లి శేఖర్, సాలయ్య, నాగరాజు, జుబేదా, సునీత, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో విఫలం : చిరుమర్తి


సమావేశంలో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

కట్టంగూరు, ఆగస్టు 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలవుతున్నా నేటికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఇవ్వకుండా ఆడబిడ్డలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన వివాహాల చెక్కులను ఇటీవల పంపిణీ చేశారని తెలిపారు. తులం బంగారంతో పాటు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టులోపు పూర్తిగా రుణమాఫీ చేస్తానని చెప్పి నేటికి 35 శాతం రైతులకే రుణమాఫీ చేశారని విమర్శించారు. రిజర్వేషన్ల సాకుతో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ తరాల బలరాములు, మాజీ వైస్ ఎంపీపీ కోటిరెడ్డి, మాజీ సర్పంచులు వడ్డె సైదిరెడ్డి, దాసరి సంజయ్, బి. యాదగిరి నాయకులు అంతటి శ్రీను, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో జాతీయ రహదారి

● రహదారిపై వెలగని వీధి దీపాలు
● లైట్లు వెలగక ప్రజల ఇబ్బందులు


కేతేపల్లిలో హైవేపై లైట్లు వెలగకపోవడంతో అలుముకున్న అంధకారం

కేతేపల్లి, ఆగస్టు 30: కేతేపల్లిలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై అంధకారం రాజ్యమేలుతుంది. కేతేపల్లిలో దాదాపు కిలోమీటర్ పొడవున ప్రధానరహదారితో పాటు ఇరువైపులా గల సర్వీసు రోడ్ల వెంట హైమాస్ట్ లైట్లను నిర్మాణ సమయంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ విద్యుత్ దీపాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రోజుల తరబడి అవి వెలగని పరిస్థితి నెలకొంది. హైవేను నిర్మించిన జీఎమ్మార్ సంస్థ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయిన నాటి నుంచి ఇటీవలి వరకూ వాటి నిర్వహణ బాధ్యతలు నెరవేర్చింది. నెల రోజుల క్రితం రహదారి నిర్వహణ నుంచి జీఎమ్మార్ సంస్థ తప్పుకోవడంతో కొత్తగా వచ్చిన వారు రోడ్డు నిర్వహణను గాలికి వదిలేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారిపై టోల్‌చార్జీలు వసూలు చేస్తున్న వారు రహదారి వెంట గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారని అన్నారు. రహదారి, హైమాస్ట్ లైట్ల నిర్వహణను పట్టించుకోకపోవడంతో రహదారి వెంట గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రం కేతేపల్లిలో ఐదు రోజులుగా రహదారి వెంట సగం ప్రాంతంలో లైట్లు వెలుగుతుండగా మరో సగం ప్రాంతంలో లైట్లు వెలగడంలేదు. దీంతో సాయంత్రం సమయంలో రోడ్డు దాటే గొర్రెలు, మేకలు, పాడి గేదెలు, కాలినడకన రోడ్డు దాటే వారు వాహనచోదకులకు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో చీకట్లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయాందోళనలు స్థానికుల్లో నెలకొన్నాయి. ఇప్పటికైనా సంబంధిత సంస్థ ప్రతినిధులు స్పందించి వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మా దృష్టికి రాలేదు

కేతేపల్లిలో వీధి దీపాలు వెలగని విషయం ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదు. సమస్యను సిబ్బంది పరిశీలించి పరిష్కరిస్తారు.

● సతీష్, ఎన్‌హెచ్ఏఐ ప్రతినిధి



సమావేశంలో మాట్లాడుతన్న నెల్లికంటి సత్యం

కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

మునుగోడు, ఆగస్టు 30: పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా సెప్టెంబరు 2వ తేదీన నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. మునుగోడులో శుక్రవారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ సంపన్న వర్గాలకు కొమ్ము కాస్తూ, పేద వర్గాలకు మోసం చేస్తుందన్నారు. ప్రధానంగా ధనిక వర్గాలను ప్రోత్సహిస్తుండటంతో రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. దీంతో పేదలపై ఆర్థికభారం పడుతుందని అన్నారు. ఈ చర్యలను నిరసిస్తూ నిర్వహించే ఆందోళన కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. నలపరాజు సతీష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు బొల్గూరి నర్సింహ, గురిజ రామచంద్రం, నలపరాజు రామలింగయ్య, అంజయ్య చారి, చాపల శ్రీను, పల్లె శేఖర్‌రెడ్డి, భిక్షంరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు


నల్లగొండ సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

దేవరకొండ, చిట్యాల, నల్లగొండ కల్చరల్, చిట్యాల రూరల్, ఆగస్టు 30: శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని దేవరకొండ పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవాలయాలకు వెళ్లి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని మార్కండేయస్వామి, అయ్యప్పస్వామి, కన్యకాపరమేశ్వరి దేవాలయం, వేంకటేశ్వరస్వామి, ముత్యాలమ్మ, మద్దెలమ్మ దేవాలయాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

● చిట్యాలలో పెద్దమ్మ, చౌడమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన కుండలలో నైవేద్యం వండుకుని మేళతాళాలు, పోతురాజుల విన్యాసాలతో బోనాలను ఊరేగిస్తూ అమ్మవానికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో జడల ఆదిమల్లయ్యయాదవ్, రెమిడాల లింగస్వామి, ఏళ్ల మల్లేష్, ఏర్పుల పరమేశం, సైదులు, సైదులు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని బ్రహ్మంగారి గుట్టపై గల కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పూలతో శాకాంబరీదేవిగా అలకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్ గౌడ్, విజయలక్ష్మి, వెంకన్న, హరినాయక్, రామలింగయ్య, లింగస్వామి, ఆవుల మధు, కోటి తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో బోనాల పండుగను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఉరుమడ్ల గ్రామంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి పాల్గొని బోనమెత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో పోలగోని స్వామి, కోనేటి యాదగిరి, పల్లపు బుద్దుడు, చెరుకు సైదులు, మర్రి రమేష్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీ రఘువీర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి

మాడ్గులపల్లి, ఆగస్టు 30: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని, అందులో భాగంగానే బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని అన్నారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, నాయకులు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పుల్లెంల సైదులు, పుల్లెంల నరసింహ పాల్గొన్నారు.

విస్తృతంగా సభ్యత్వ నమోదు చేయాలి : బీజేపీ

నల్లగొండ రూరల్, దేవరకొండ, చింతపల్లి, చండూరు, మునుగోడు, ఆగస్టు 29: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజవంతం చేయాలని పార్టీ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి చనమోని రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ అన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. నల్లగొండ మండలంలో బీజేపీ సభ్యత్వాలు అధికంగా నమోదు చేయాలని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని అన్నారు. సెప్టెంబరు 1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదును చేయనున్నట్లు తెలిపారు.

● నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోగరి అనిల్‌కుమార్, నాయకులు ప్రమోద్, మహేష్, సురేష్, రుక్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● దేవరకొండలో పట్టణంలోని టీడీడీ కల్యాణ మండపంలో నూతన సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చనమోని రాములు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కర్నాటి సురేష్, వస్కుల సుధాకర్, నర్సింహ, వెంకటేష్, రెడ్డిశంకర్, భాస్కర్, చండీశ్వర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

● చింతపల్లి పార్టీ కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీతోనే దేశం అన్నీ రంగాల్లో ప్రగతి చెందుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపిడి అనిల్‌రెడ్డి, నాయకులు వెన్నం శేఖర్, బొడ్డు మహేష్‌గౌడ్, క్రాంతిరెడ్డి, గంగల వెంకటయ్య, శ్రీశైలంయాదవ్, అభినవ్‌గౌడ్, అంజి పాల్గొన్నారు.

● చండూరు, మునుగోడులో నిర్వహించిన సమావేశాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్, ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. సమావేశాల్లో నాయకులు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, సోమ నర్సింహ, చిలువేరు దుర్గయ్య, కోమటి వీరేశం, ఆంజనేయులు, పందుల సత్యం, వెంకన్న, బోడ ఆంజనేయులు, మునుగోడులో నిర్వహించిన సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, బిక్షంగౌడ్ పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ వీరబాబు

పెద్దవూర, త్రిపురారం ఆగస్టు 30: పండుగలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పెద్దవూర, త్రిపురారం ఎస్ఐలు వీరబాబు, ప్రసాద్ అన్నారు. మండల కేంద్రాలలోని పోలీస్‌స్టేషన్లలో వినాయక చవితి సందర్భంగా వినాయక మండపాల నిర్వాహకులు, వివిధ మత పెద్దలతో శుక్రవారం నిర్వహించిన పీస్ కమిటీ సమావేశాల్లో వారు మాట్లాడారు. పండుగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే స్థలాలను, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. విగ్రహాలను ఏర్పాటు చేసుకునే వారు ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా ఉండాలని, డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా డీజేలు పెడితే సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. త్రిపురారంలో జరిగిన సమావేశంలో మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి దస్తగిరి, భైరం కృష్ణ, శ్రీను, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్సీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

త్రిపురారం ఆగస్టు 30: సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. త్రిపురారం మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు రూ. 11,21,500 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది డబ్బులు ఖర్చు చేసుకున్న వారిని ఆదుకోవడం కోసం సీఎం సహాయనిధి ద్వారా కొంత ఊరట కలుగుతుందని అన్నారు. ప్రజలను రుణ విముక్తులను చేసేందుకే ప్రభుత్వాలు సీఎంఆర్ఎఫ్ నిధులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకటరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, భైరం కృష్ణ, గోపు కోటిరెడ్డి, నగిరి శ్రీనివాస్, వెంకన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీకి ప్రత్యేక శిబిరాలు : ఏడీఏ


అనుములలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న రైతులు

హాలియా, ఆగస్టు 30: రైతు రుణమాఫీ చేసేందుకు గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, రుణమాఫీ కానీ రైతులు తమ దరఖాస్తులను అందజేసి సద్వినియోగం చేసుకోవాలని హాలియా ఏడీఏ వెంకటరవీందర్ అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని అనుములలో శుక్రవారం నిర్వహించిన శిబిరంలో ఆయన పాల్గొని రైతుల దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ. 2లక్షలు లేదా 2 లక్షల లోపు రుణమాఫీ కానీ రైతులు ఉంటే వారి కుటుంబ సభ్యులను గుర్తించడం వల్ల వారికి రుణమాఫీ అందనున్నట్లు తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లోకి వచ్చినప్పుడు వ్యవసాయాధికారులకు అందుబాటులో ఉండి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో సరిత, ఏఈవో కల్యాణ్, అరవింద్, నాగయ్య పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ పోరుయాత్ర

దామరచర్ల, ఆగస్టు 30: సంక్షేమ హాస్టళ్ల పరిరక్షణ, విద్యారంగం పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెప్టెంబరు 2వ తేదీ నుంచి పోరుయాత్ర చేపట్టనున్నట్లు సంఘం మండల కార్యదర్శి వీరన్ననాయక్ తెలిపారు. మండలంలోని కొండ్రపోల్ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ మోటార్ సైకిల్ యాత్ర కరపత్రాన్ని ఆయన విడుదల చేసి మాట్లాడారు. సెప్టెంబరు 2వ తేదీన చండూరులో ప్రారంభమయ్యే యాత్ర 6వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ పోరుయాత్రలో సంక్షేమ హాస్టళ్ళ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అజయ్, విష్ణు, రాహుల్, గిరిధర్, వంశీ, తరుణ్, అక్షయ్, శిరీష, శ్రీజ, స్రవంతి, స్పందన, ప్రసన్న, నందిని పాల్గొన్నారు.

'గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి'


వినతిపత్రం అందజేస్తున్న జీడయ్యయాదవ్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 30: బీసీ గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలని బీసీ విద్యార్థి సంఘ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సొసైటీ సెక్రటరీ సైదులుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. వసతుల లేమితో గురుకుల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో తేళ్లు, పాములతో విద్యార్థులు సహజీవనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురులాలకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. జనాభాలో అధికశాతం ఉన్న బీసీ విద్యార్థుల కోసం నియోజకవర్గానికి రెండు గురుకులాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మురళీయాదవ్, నాగరాజు, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాలిగౌరారంలో మెగా హెల్త్ శిబిరం


శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

శాలిగౌరారం, ఆగస్టు 30: శాలిగౌరారం మండల కేంద్రంలోని మార్కెట్‌లో హైదరాబాద్‌లోని నక్షత్ర హాస్పిటల్ వారు మెగా హెల్త్ శిబిరాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించిన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నక్షత్ర హాస్పిటల్ ఆర్థోపెడిక్ డాక్టర్ వంశీ చంద్రరాజు, ఎండీ నితీన్ ప్రసాద్, కనకరాజు భావ్య, నిర్వాహకులు అంతటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

దామరచర్ల: పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడిగా అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కుంభం సైదిరెడ్డి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సంఘ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు డీవీఎస్.ఫణికుమార్, ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: విద్యార్థులు చదువులో రాణిస్తూనే భగవద్గీత పారాయణం చేసి దైవభక్తిని పెంపొందించుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేష్, మేకల శ్రీనివాస్ అన్నారు. కొండమల్లేపల్లిలో శుక్రవారం భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. ప్రథమ బహుమతి సాయిసిద్దార్థ పాఠశాల విద్యార్థి సాత్విక్, ద్వితీయ బహుమతి గౌతమి పాఠశాల విద్యార్థి విద్య, మూడవ బహుమతి కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి కిరణ్‌లకు అందజేసి అభినందించారు. ఈ పోటీల్లో సాయి సిద్దార్థ, గౌతమి, సంస్కృతి, కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లగొండ కల్చరల్: సెప్టెంబరు 1వ తేదీన పెన్షన్ విద్రోహ దినంగా నిర్వహించనున్నట్లు టీజీఈజేఏసీ నాయకులు తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. సీపీఎస్, యూపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిర్వహించే నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.

మిర్యాలగూడ టౌన్: వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ కరుణాకర్‌ను స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొమ్ము శ్రీనివాస్, మీడియా ప్రతినిధి మంద సైదులు, వెంకటేష్, రమేష్, శ్రీనివాస్ తదితరులు సీఐకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

● చింతపల్లి: మండలంలోని గొడకొండ్ల బస్టాండ్ సమీపంలోని నాగులమ్మ దేవాలయంలో చైర్మన్ గడ్డం అంజనేయులు పూజలు చేశారు.

చిట్యాలరూరల్: మండలంలోని గుండ్రాంపల్లి శివారులో ఉన్న శ్రీపతి ల్యాబ్‌లో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని, యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల నాయకుడు కత్తుల లింగస్వామి, సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి జిల్లా సత్యం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు, పొగలు వ్యాపించాయని కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు శ్రీపతి ల్యాబ్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చందంపేట: మండంలోని పేర్వాల గ్రామంలో రూ.35 లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఆలయంలో ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నకిరేకల్: ఉదారి నాగదాసు స్మారక కవిత అవార్డుకు ప్రముఖ కవి, అసోసియేట్ ప్రొఫెసర్ నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ బెల్లి యాదయ్యను ఎంపిక చేసినట్లు అవార్డు కమిటీ అధ్యక్షుడు ఉదారి నారాయణ తెలిపారు. సెప్టెంబరు 15వ తేదీన ఆదిలాబాద్‌లో జరిగే కార్యక్రమంలో బెల్లి యాదయ్యకు అవార్డు కింద రూ.5వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తామని తెలిపారు. అవార్డుకు ఎంపికైన బెల్లి యాదయ్యను ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎంజీయూ రిజిస్ట్రార్ ఆచార్య అల్వాల రవి, సాగర్ మాజీ ఎమ్మెల్యే భగత్ తదితరులు అభినందించారు.

చిట్యాలరూరల్: వ్యవసాయ రుణాలను తీసుకున్న రైతులకు ప్రభుత్వం చేసిన రుణమాఫీ అర్హులైన రైతులందరికి జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. చిట్యాల మండలం సుంకెనపల్లిలో శుక్రవారం రైతుల వివరాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులకు రుణమాఫీ జరుగుతుందన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కనగల్, ఆగస్టు 30: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకుని భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం, బోననైవేద్యాలను సమర్పించుకున్నారు. పుట్టలో పాలుపోసి నాగపడిగలకు మొక్కుకున్నారు. కోర్కెలు నేరవేరాలని ముడుపులు కట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయసిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

స్లూయిజ్ గేట్‌లోని బండరాళ్ల తొలగింపు

కనగల్, ఆగస్టు 30: కనగల్ పైల సముద్రం చెరువుకు నీటిని తరలించే స్లూయిజ్ గేట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అడ్డంగా వేసిన బండరాళ్లను తొలగించారు. శుక్రవారం మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రైతులు తొలగించి పైల సముద్రానికి నీటి తరలింపులో ఏర్పడిన అడ్డంకులను తొలగించారు. డి37 కాల్వ పరిధిలో స్లూయిజ్ గేట్ మరీ చిన్నదిగా ఉండటంతో చెరువుకు నీరు చేరటం లేదు. ఈ క్రమంలో రైతుల కోరిక మేరకు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్ పైలసముద్రాన్ని నింపేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ తనవంతు కృషి చేస్తున్నారు. పైలసముద్రం చెరువు నిండితే సుమారు 2 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని రైతులు తెలిపారు. మంత్రితో మాట్లాడి పూర్తి స్థాయిలో నీటిని చెరువులో నింపేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.